సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

శుక్రవారం 27-12-2024

సంపుటి: 20 సంచిక: 233

పేజీలు: 4 వెల: రూ.1

## మన్మోహన్‌సింగ్ మృతి బాధాకరం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి బాధాకరమని, దేశంలో నూతన ఆర్థిక సంస్కరణలు చేపట్టిన వ్యక్తిగా చరిత్రలో నిలిచిపోతారని రాష్ట్ర వ్యవసాయ, సహకార, పశుసంవర్ధక, మార్కెటింగ్, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు పేర్కొన్నారు. పదేళ్ల పాటు భారత ప్రధానిగా సేవలందించిన మన్మోహన్ సింగ్ మృతి తీరని లోటన్నారు. 1991లో ఆర్థిక మంత్రిగా ఆయన చేసిన ఆర్థిక సంస్కరణల నుంచి ప్రధానమంత్రిగా ఆయన దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.



## ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్‌లో

# నకిలీ రుణాలు



**స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా శ్రీకాకుళం మెయిన్ బ్రాంచిలో దాదాపు రూ.4 కోట్ల నకిలీ రుణాలు వెలుగులోకి వచ్చినట్లు అత్యంత విశ్వసనీయ వర్గాల భోగట్టా. గార బ్రాంచిలో తాకట్టులో ఉన్న బంగారు నగలు ఇంకా ఖాతాదారులకు పూర్తిగా చేరకముందే, నరసన్నపేట బజారు బ్రాంచిలో నకిలీ రుణాల కుంభకోణంలో దోషుల మీద ఎఫ్ఐఆర్ నమోదు కాకముందే శ్రీకాకుళం మెయిన్ బ్రాంచిలో మరో కుంభకోణం జరిగిందన్న ప్రచారం బ్యాంకు వర్గాలను కుదిపేస్తోంది. స్టేట్‌బ్యాంక్ మెయిన్ బ్రాంచిలో ఏం జరుగుతుందో తెలియదుగానీ గత కొద్ది రోజులుగా బ్యాంకు విజిలెన్స్ విభాగం ఇక్కడి రికార్డులను పరిశీలించి అనేక రుణ ఖాతాలకు సంబంధించిన రికార్డులను సీల్ వేసిందని ప్రచారం జరుగుతోంది. వివరాల్లోకి వెళితే..**

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నరసన్నపేట బజారు బ్రాంచిలో ఏమాదిరిగా ఎంఎస్ఎంఈ రుణాల పేరుతో బ్యాంకు అధికారులు తమ ఖాతాలో సొమ్ములు వేసుకొని రొటేషన్ చేసుకున్నారో, మెయిన్ బ్రాంచిలో కూడా ఇప్పుడు అదే మాదిరిగా నకిలీ రుణాలు ఇచ్చినట్లు తెలుస్తుంది. ఈ బ్రాంచిలో కొలట్రల్ ష్యూరిటీ పెట్టిన ఆస్తి కంటే ఎక్కువ మొత్తంలో రుణాలు మంజూరు చేయడం ఒకటైతే, అసలు లబ్ధిదారులే లేకుండా సూక్ష్మరుణాల పేరుతో కొంత మొత్తాన్ని వేరే ఖాతాలకు డైవర్ట్ చేయడం మరో అంశం. దీనికి సంబంధించి బ్యాంకు విజిలెన్స్ అధికారులకు ఎప్పుడు, ఎక్కడ్నుంచి ఉప్పందిందో తెలియదుగానీ గత కొద్ది రోజులుగా ఇక్కడ రికార్డులను పరిశీలించి దాదాపు రూ.4కోట్ల వరకు ఈ విధంగా ప్రజల సొమ్ము దారిమళ్లిందని గుర్తించినట్లు తెలుస్తుంది. విచిత్రంగా అటు గార, ఇటు నరసన్నపేట బజారు బ్రాంచి కుంభకోణాలు జరిగినప్పుడు రీజనల్ మేనేజర్‌గా వ్యవహరించిన టీఆర్ఎం రాజు హయాంలోనే ఇందులో ఎక్కువ మొత్తం జరిగినట్లు తెలుస్తుంది. ఎస్‌బీఐలో ఇటువంటి కుంభకోణాలు బయటపడినప్పుడు ముందుగా ఫీల్డ్ ఆఫీసరు, బ్రాంచి మేనేజర్లను మూడో కంటికి తెలియకుండా బదిలీ చేసేస్తున్నారు. దీంతో ఆలస్యంగా ఇటువంటి

- **పాత ఆర్.ఎం. హయాంలోనే అధికం**
- **కొద్ది రోజులుగా రికార్డులు పరిశీలిస్తున్న విజిలెన్స్**
- **నరసన్నపేట బ్రాంచ్ శైలిలోనే ఆర్థిక నేరం**
- **టీఆర్ఎం రాజు ఖాతాలో మరికొందరు బలి**

వ్యవహారాలు వెలుగుచూస్తున్నాయి. ఇప్పుడు మెయిన్ బ్రాంచి విషయంలో కూడా నకిలీ రుణాల అంశం బయటపడటంతో సంబంధిత ఫీల్డ్ ఆఫీసర్‌ను కొన్నాళ్ల క్రితం ఇక్కడి నుంచి వేరేచోటకు పంపించేశారు. మూడోకంటికి తెలియకుండా చూడాలని బ్యాంకు ఉన్నతాధికారులు తాపత్రయపడ్డారు. అయితే నకిలీ రుణాలను మళ్లీ రికవరీ చేయాల్సి ఉండటంతో ఎవరి పేరుతో ఎంత ఇచ్చారు? అందుకు సంబంధించి కొలట్రల్ ష్యూరిటీగా ఎంతమేర ఆస్తిపత్రాలు ఉంచారు? అన్న వివరాలను పరిశీలిస్తున్నారు. ఇందులో ష్యూరిటీ కింద ఇచ్చిన పత్రాల్లో ఉన్న ఆస్తి కంటే మంజూరుచేసిన రుణం ఎక్కువుందని గ్రహించి కొందర్ని విచారించగా, అప్పట్లో సంబంధిత బ్యాంకు అధికారులను మేనేజ్ చేసి, సొమ్ములిచ్చి రుణాన్ని పొందామని వారు చెబుతున్నట్టు భోగట్టా. ప్రస్తుతం ఇక్కడి నుంచి బదిలీ చేయబడిన ఫీల్డ్ ఆఫీసర్ ఇచ్చిన రుణం రూ.75 లక్షలు కాగా, అంతకు ముందు నుంచి రూ.3 కోట్లు పైబడి నకిలీ రుణాలు బ్యాంకు దాటేసినట్టు తెలుస్తుంది. ఇటువంటి రుణాలు మంజూరుచేసినప్పుడు బ్రాంచి మేనేజర్, ఫీల్డ్ ఆఫీసర్ దగ్గర్నుంచి రీజనల్ మేనేజర్ వరకు అందరూ పరిశీలిస్తారు. ఫీల్డ్ ఆఫీసర్ స్థాయిలో లోపం ఉందని గుర్తించినా రీజనల్ మేనేజర్ స్థాయిలో బిజినెస్ పేరుతోనో, ఆబ్లిగేషన్ పేరుతోనో, ప్రీమియం కస్టమర్ అన్న సాకుతోనో రుణాలు పరిమితికి మించి ఇమ్మంటే కిందిస్థాయి అధికారులు ఇవ్వాల్సిందే. కానీ ఈ వ్యవహారం బయటపడిన తర్వాత మాత్రం ఆర్ఎం స్థాయి వ్యక్తులను బ్యాంకు మేనేజ్‌మెంట్ రక్షించి, కిందవారిని బలి తీసుకుంటుంది. గార బ్రాంచిలో బంగారు నగలు మాయమయ్యాయని అప్పటి ఆర్ఎం రాజు ప్రకటించడం, దానికి అసిస్టెంట్ మేనేజర్ స్వప్నప్రియ కుటుంబమే కారణమని పోలీసులకు ఫిర్యాదు చేయడం ఒక ఎత్తయితే, దర్యాప్తు జరుగుతుండగానే బ్రాంచిలో పని చేస్తున్న సిబ్బందిని బదిలీ చేసేశారు. చివరకు ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్న అటెండర్లను కూడా అక్కడి నుంచి మార్చేశారు. అంటే పోలీసులు విచారణకు వస్తే ఆ సమయంలో తాము లేమని, ఎటువంటి సమాచారం తెలియదని చెప్పి తప్పించుకోవడమే టీఆర్ఎం రాజు ప్రధాన వ్యూహం. ఆయన ఇక్కడ ఆర్ఎంగా పని చేసినప్పుడు వెలుగుచూసిన రెండు కుంభకోణాల మీద ఇంతవరకు ఎటువంటి శాఖాపరమైన చర్యలు తీసుకోలేదు. ఇప్పుడు తాజాగా ఆయన హయాంలోనే శ్రీకాకుళం మెయిన్ బ్రాంచిలో కూడా నకిలీ రుణాలు వెలుగుచూసిన తర్వాతనైనా ఆయనపై చర్యలుంటాయా అనేది ప్రశ్నార్థకమే. ఎందుకంటే నరసన్నపేట బజారుబ్రాంచిలో నకిలీల పేరుతో రుణాలు బయటికి వెళ్లిపోయాయని 'సత్యం' మొట్టమొదటిసారిగా వెలుగులోకి తీసుకువచ్చిన తర్వాత అవన్నీ గిట్టని రాతలని టీఆర్ఎం రాజు తేల్చిపారేశారు. కానీ అప్పటి ఆమదాలవలస చీఫ్ మేనేజర్ బీఏఎన్ మూర్తి నరసన్నపేట వచ్చి విచారణ చేపట్టిన తర్వాత 'సత్యం'లో వచ్చినది వాస్తవమేనని తేల్చడంతో ఆయన్ను ఆకస్మికంగా ఆమదాలవలస నుంచి బదిలీ చేసేశారు. ఇప్పుడు కూడా శ్రీకాకుళం మెయిన్ బ్రాంచిలో టీఆర్ఎం రాజు పాత్ర బయటపడకుండా ఉండేందుకు ఫీల్డ్ ఆఫీసర్‌ను ఇంతకు క్రితమే ఇక్కడి నుంచి పంపించేశారు. ఇవన్నీ చూస్తుంటే టీఆర్ఎం రాజు వెనుక స్టేట్‌బ్యాంకుకే చెందిన పెద్ద తలకాయలెవరో ఉన్నట్టు అనుమానం కలగకమానదు.

- **బెనిఫిట్ షోలు, బొంగులో షోలు లేవన్న రేవంత్**
- **సినిమాల్లోనే పౌరుషం.. బయట ఏమాత్రం కనపడని రోషం**
- **జగన్‌ను కలిసినప్పుడు గింజుకున్నారు.. రేవంత్‌తో కరచాలనానికే కక్కుర్తిపడ్డారు**
- **సినిమాలో హీరోలు.. నిజజీవితంలో జీరోలు**
- **ఆకాశంలో 'తార'ల్ని నేలకు దింపిన రేవతి**

- ఎందుకు ఈ ముష్టి సినీవీరులకే అడుగడుగునా ఈ వీరముష్టి? కళామతల్లి ముద్దుబిడ్డలకే ఎందుకు ఈ యాచక బతుకులు?
- మన మహా హీరోలకు కులపరమైన ఉన్మాదులు తప్ప కళాపూర్వకమైన అభిమానులు ఒక్కరంటే ఒక్కరు లేరు. వీళ్ల కళ ఏపాటిదని అభిమానులు ఉండడానికి!
- తెలంగాణలో వీళ్ల కులాత్మకత పనిచేయక నేల మీదకు దిగివచ్చి బొచ్చెతో అక్కడ ముఖ్యమంత్రి దగ్గరికి వెళ్తే ఆయన బెనిఫిట్ షోలు, బొంగులో షోలు లేవంటూ వీళ్ల చేతిలో బొకేలు, వాళ్లు తెచ్చిన శాలువలు లాగేసుకుని మరీ వెనక్కి పంపించేశారు.
- తెలంగాణ పోలీస్ కమాండ్ రూమ్‌లో రేవంత్‌రెడ్డి సినీ ప్రముఖులతో సమావేశం పెట్టారు. జగన్మోహన్‌రెడ్డి లాగా క్యాంప్ కార్యాలయానికి ఆహ్వానించలేదు సరికదా.. రేవంత్‌రెడ్డి వస్తారని సినీ ప్రముఖులంతా చాలాసేపు అక్కడ వెయిట్ చేశారు. దీనిపై ఇంతవరకు ఎక్కడా సినీ ప్రముఖులు నోరు విప్పలేదు సరికదా.. ఇదే మురళీ మోహన్ ముందు మైక్ పెడితే, అంతా సవ్యంగానే జరిగిందని చెప్పుకురావడం కొసమెరుపు.
- తన కొడుకుపైనే హత్యానేరం మోపి ఎట్టి పరిస్థితుల్లోనూ జైలులో ఉంచాలని భావించిన రేవంత్‌రెడ్డిని నిస్సిగ్గుగా కలిసి ముఖం మీద నవ్వరంగు పులుముకొని బయటికొచ్చిన అల్లు అరవింద్‌ను ఏమనాలి?

# ఎందుకీ యాచకబతుకులు?!

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఇంపోర్టెడ్ కార్లలో ఖరీదైన దుస్తులు వేసుకుని చలువ కళ్లద్దాలు పెట్టుకుని, బౌన్సర్లను, వంది మాగధులను వెంట బెట్టుకుని అచ్చం పెదరాయుడు మూవీలో సత్యనారాయణలా దిగి ముఖ్యమంత్రి దగ్గర వంగి వంగి నమస్కారాలు పెట్టి ముష్టి అడుక్కోడం కంటే, దుబారా ఖర్చులు తగ్గించుకుని, పద్ధతిగా నాణ్యమైన సినిమాలు తీసి, న్యాయమైన టికెట్ రేట్లతో జనాలు సినిమాలు ఆదరించేలా చేసుకోవచ్చు కదా. ఈ దేశంలో ఏ రిక్షా పుల్లర్ అయినా 10 రూపాయల కిరాయికి 30 రూపాయలు ఇప్పించమని ప్రభుత్వాన్ని కోరుకున్నాడా? ఈ దేశంలో ఏ ఆటోవాలా అయినా ప్రజల్ని వేగంగా గమ్యాలు చేర్చడానికి ఆటో కొనుక్కుంటున్నాను, అందుచేత కారుచౌకగా నాకు ఒక ఆటో ఇప్పించండి అని ప్రభుత్వాన్ని వేడుకున్నాడా? ఈ దేశంలో ఏ కార్మికుడు అయినా నేను చాలీచాలని జీతంతో బతకడమే కష్టంగా వుంది, గుడిసె అయినా వేసుకుంటాను.. అని కనీసం గజం స్థలం అయినా ప్రభుత్వాన్ని ఉచితంగా అడిగాడా? ఏ ఉద్యోగయినా మీరు వేసే ఈ టాక్స్‌లు కట్టలేకపోతున్నాను.. నాకు ఆదాయపు పన్ను నుంచి ఈ సంవత్సరం మినహాయింపు ఇవ్వండి అని ప్రభుత్వాన్ని అడుక్కున్నాడా? ఒకవేళ పొరపాటున ఎవరైనా అడిగినా ఏ ప్రభుత్వం అయినా అలా వాళ్లకు సాయం చేసిందా? మరి ఎందుకు ఈ ముష్టి సినీవీరులకే అడుగడుగునా ఈ వీరముష్టి? కళామతల్లి ముద్దుబిడ్డలకే ఎందుకు ఈ యాచక బతుకులు?

తెలంగాణ ముఖ్యమంత్రితో తెలుగు సినీ ప్రముఖుల భేటీ (అంటే దేబిరింత) పూర్తయ్యాక మన మహా వీరులకి తమ స్థానం ఏంటో తెలిసి వచ్చింది. ఆంధ్రలో లాగా తెలంగాణలో కులాల కుమ్ములాటలు మరీ ఇంత రొచ్చు స్థాయిలో లేకపోవడం వల్ల ఏ హీరోను తక్కువ చేస్తే ఆ కులపోళ్ల మనోభావాలు దెబ్బతినిపించుకుంటారోననే దుస్థితి అక్కడ లేకపోవడం వల్ల చాలా సాదాసీదాగా అక్కడ మీటింగ్ జరిగింది. మన మహా హీరోలకు కులపరమైన ఉన్మాదులు తప్ప కళాపూర్వకమైన అభిమానులు ఒక్కరంటే ఒక్కరు లేరు. వీళ్ల కళ ఏపాటిదని అభిమానులు ఉండడానికి!



వందల కోట్లలో సినిమా వ్యాపారం జరగటం, సామాన్యుడికి అది అందుబాటులో ఉన్న ఒక అవకాశం కావటం వల్ల వీళ్లంతా మహా స్టార్లు అవటం మినహా మామూలుగా మనుషులుగా చూస్తే వీళ్లంతా అతి సామాన్య గుణగణాలు ఉన్నటువంటి వాళ్లు కూడా కాదనేది ఆయా సినిమా ఫంక్షన్లలో మైకుల ముందు వాళ్లు మాట్లాడే చెత్త చూస్తే అర్థమవుతుంది. ఈపాటి దానికి వీళ్లంతా తమ పేర్ల చివరన బాబు అని తగిలించుకుని వాళ్లలో వాళ్లే తెగ గౌరవించేసుకుంటారు వినేవాడికి ఒళ్లు మండిపోతుందనే జ్ఞానం కూడా లేకుండా. తెలంగాణలో వీళ్ల కులాత్మకత పనిచేయక నేల మీదకు దిగివచ్చి బొచ్చెతో అక్కడ ముఖ్యమంత్రి దగ్గరికి వెళ్తే ఆయన బెనిఫిట్ షోలు, బొంగులో షోలు లేవంటూ వీళ్ల చేతిలో బొకేలు, వాళ్లు తెచ్చిన శాలువలు లాగేసుకుని మరీ వెనక్కి పంపించేశారు. వేలాది కోట్ల రూపాయలు వెనకేసుకుని కూడా సిగ్గు చంపుకుని ప్రభుత్వం ముందు అడుక్కోవడానికి వెళ్లిన వీళ్లంతా పాలిపోయిన ముఖాలతో వెనక్కి వచ్చేశారు. మురళీ మోహన్ లాంటి అవకాశవాదులు కూడా ఇక మళ్లీ ఎక్కడా నోరు ఎత్తరు. ఒక్క రేవతి చనిపోయి వీళ్లందరికీ క్రమశిక్షణ నేర్పింది అనే అనాలి.

దిల్ రాజు నోట్లో నుంచి పెద్ద బూతు విన్నాం. మాకు టికెట్ల రేట్లు, బెనిఫిట్ షోలు, ప్రీమియర్ షోలు అనేవి ప్రధానమైనవి కావు, సినిమాను అంతర్జాతీయ స్థాయికి తీసుకుని వెళ్లడమే మా ధ్యేయం అంటూ కొత్త భాషణం చెప్పాడు హృదయ రాజు? ఏది ఏమైనా మీకు ఇలానే జరగాలి. సినిమా ఇండస్ట్రీ వాళ్లను ఇలా ట్రీట్ చేయాలని తెలియక సరిగ్గా ట్రీట్ చేసి మా జగన్మోహన్ రెడ్డి తప్పు చేసారు. కట్ట కట్టుకుని నలభై మంది వెళ్లారు, సినిమా టికెట్ల రేట్లు పెంచం, బెనిఫిట్, ప్రీమియర్‌లు ఉండవు అని తేల్చి చెప్పి ఇకపై సినిమాలకు ప్రత్యేకంగా సెస్ ఉంటుందని వాత పెట్టి పంపారు రేవంత్‌రెడ్డి. రాయితీలు ఇవ్వకపోగా ఆదాయంలో కోత పెట్టాడుతున్నారు. మీకు ఇలా వాతలు పెడితేనే సెట్ అవుతారు. మీకు ఈ రూటే కరెక్ట్. తన అన్న చిరంజీవి జగన్మోహన్‌రెడ్డి దగ్గరకు వెళ్లి చేతులు కట్టుకొని కూర్చున్నారంటూ అప్పట్లో పవన్‌కల్యాణ్ తెగ ఆవేదన చెందారు. ఇప్పుడు తెలుగు సినీఇండస్ట్రీకి చెందిన మహామహులు రేవంత్‌రెడ్డి ముందు ఎలా మోకరిల్లారో గురువారం చూశాం. హీరోలు, దర్శకులు, నిర్మాతలు శాలువాలు కప్పి దండం పెట్టడం తప్ప రేవంత్‌రెడ్డి ఎవరికీ ప్రతినమస్కారం చేసిన సీన్ కనపడలేదు. ఓపెన్ హార్ట్ విత్ ఆర్‌కేలో సినీనటుడు, రాజకీయవేత్త మురళీమోహన్ అప్పట్లో జగన్మోహన్ రెడ్డి ఇంటి గేటు ముందు వాహనాలు ఆపి లోపలికి నడిపించారని గగ్గోలు పెట్టారు. గురువారం మాత్రం తెలంగాణ పోలీస్ కమాండ్ రూమ్‌లో రేవంత్‌రెడ్డి సినీ ప్రముఖులతో సమావేశం పెట్టారు. జగన్మోహన్ రెడ్డి లాగా క్యాంప్ కార్యాలయానికి ఆహ్వానించలేదు సరికదా.. రేవంత్‌రెడ్డి వస్తారని సినీ ప్రముఖులంతా చాలాసేపు అక్కడ వెయిట్ చేశారు. దీనిపై ఇంతవరకు ఎక్కడా సినీ ప్రముఖులు నోరు విప్పలేదు సరికదా.. ఇదే మురళీ మోహన్ ముందు మైక్ పెడితే, అంతా సవ్యంగానే జరిగిందని చెప్పుకురావడం కొసమెరుపు. రేవంత్‌రెడ్డి సినీపరిశ్రమకు వరాలివ్వలేదు సరికదా.. సినిమాలు ఎలా తీయాలో డైరెక్షన్ ఇచ్చి పంపారు. సినిమాల్లో మీసాలు మెలేసి, తొడలు కొట్టే హీరోలు నిజ జీవితంలో కనీసం ఆత్మాభిమానం ఉన్న మనుషులుగా కూడా నిన్న కనిపించలేదు. మొన్నటికి మొన్న యువసామ్రాట్ నాగార్జున మాజీ కోడలు సమంత కేరెక్టర్‌ను నిందిస్తూ నాగార్జున మీదే ఆరోపణలు చేసిన తెలంగాణ మంత్రి కొండా సురేఖ మీద చర్యలు తీసుకోవాలని ఒక్క మాట కూడా అనని అక్కినేని వంశాంకురం, ఆ తర్వాత తన ఎన్ కన్వెన్షన్ కూల్చేస్తే అక్రమమని రేవంత్ రెడ్డిని ప్రశ్నించని హీరో బేషరతుగా రేవంత్‌రెడ్డిని సినీ పరిశ్రమ తరఫున కలవడం ఏం సంకేతం ఇస్తున్నట్టు? తన కొడుకుపైనే హత్యానేరం మోపి ఎట్టి పరిస్థితుల్లోనూ జైలులో ఉంచాలని భావించిన రేవంత్‌రెడ్డిని నిస్సిగ్గుగా కలిసి ముఖం మీద నవ్వరంగు పులుముకొని బయటికొచ్చిన అల్లు అరవింద్‌ను ఏమనాలి? సంధ్యా థియేటర్ తొక్కిసలాటలో అల్లు అర్జున్ ఎ-11గా ఉన్నారు. 1 నుంచి 10వరకు ఉన్న నిందితులను కాదని కేవలం పుష్పరాజ్ మీదే కాన్సంట్రేట్ చేసిన రేవంత్‌రెడ్డి వద్దకు వెళ్లి పాహిమాం అనడం ఏ పౌరుషానికి నిదర్శనం? సినీ హీరోల ఆత్మాభిమానం దెబ్బతిందని ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ వ్యాఖ్యలను సమర్థించిన మురళీమోహన్ ఇప్పుడు రేవంత్‌రెడ్డి వద్దకు వెళ్లి ఏం బావుకున్నట్టు? చిరంజీవి అనే ఒక నటుడు ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తికి నమస్కారం పెడితే దాన్ని రాద్ధాంతం చేసారు. నేడు ఏమి జరుగుతుందని అందరూ వెళ్లి భయంతో మోకరిల్లారు? అయినా కూడా మిమ్మల్ని పట్టించుకోలేదు. మిమ్మల్ని ఇంటికి పిలిచి గౌరవంగా అన్నా అన్నా అంటే వినరు, మీరెంతరా ఆఫ్ట్రాల్ మొహానికి రంగు లేసుకునే వాళ్లు అంటేనే మీకు తృప్తిగా సంతృప్తిగా ఉంటుందేమో!

● గెస్ట్ ఎడిటోరియల్

## మౌన ముని మహాభినిష్క్రమణ

నిజానికి తను పొలిటిషియన్ కాదు.. ఆర్థిక రథాన్ని ఎలా నడపాలో బాగా తెలిసిన సారథి.. ప్రణాళికవేత్త.. అన్నింటికీ మించి పదే పదే ప్రశంసించదగిన సుగుణం. అవినీతి, అక్రమాలతో కుళ్లిన వర్తమాన రాజకీయ వ్యవస్థలోనే దశాబ్దాల పాటు కీలక స్థానాల్లో ఉన్నా సరే, ఏదీ అంటకుండా నిష్కళంకుడిగా బతికిన స్వచ్ఛుడు. తన ఆర్థిక విధానాలను, తన పాలన విధానాలను తీవ్రంగా వ్యతిరేకించే వ్యక్తులు, పార్టీలు కూడా ఆయన్ని ఎప్పుడూ అవినీతిపరుడిగా విమర్శలకు పోలేదు. తను ప్రధానిగా ఉన్న పదేళ్ల యూపీఏ పాలనలో బోలెడు అక్రమాలు, అవినీతి భాగోతాలు.. అది వైఫల్యం కాదా అనేవాళ్లూ ఉంటారు. తను నిస్సహాయుడు, యూపీఏ హయాంలో కాంగ్రెస్, దాని భాగస్వామ్య పక్షాల నిర్వాకాలకు తను మౌనసాక్షి మాత్రమే. మొత్తం తన జీవితచరిత్రలో బాగా నచ్చేది ఈ స్వచ్ఛతే. స్టేట్స్‌మన్ అనే పదానికి ఓ ఐకన్ తను. ఎక్కడా ఒక్క పదం కూడా తూలడు.. వ్యర్థ ప్రసంగాలు ఉండవు.. అమర్యాద, కుసంస్కారం, బంధుప్రీతి వంటివేమీ లేని టవరింగ్ పర్సనాలిటీ. అందుకే 92 ఏళ్ల జీవితం మకిలిపట్టలేదు. 2జీ కుంభకోణంలో భ్రష్టుపట్టిన మాజీ కేంద్ర మంత్రి రాజా ఓసారి తమ నిర్ణయాలన్నీ ప్రధానితో సంప్రదించాక తీసుకున్నవే అని ఆరోపించాడు. మన్మోహన్ సింగ్‌కు బురద పూసి, తమపై ఆరోపణల తీవ్రత తగ్గించుకునే మూర్ఖపు ఎత్తుగడ. జాయింట్ పార్లమెంటరీ కమిటీ మన్మోహన్ సింగ్ తప్పు వీసమెత్తు లేదని క్లీన్‌చిట్ ఇచ్చింది. ఇంకేదో ఇష్యూలో అప్పటి ప్రధాని కార్యాలయ అధికారులను సైతం సీబీఐ ప్రశ్నించింది. ఎక్కడా ఎవ్వరూ మన్మోహన్ మీద అణువంత అవినీతి మరకను కూడా చూపలేకపోయారు. తను రాజకీయ పదవులు అధిరోహించిన ఓ హైలెవల్ బ్యూరోక్రాట్. అదీ సింపుల్‌గా మన్మోహన్ సింగ్. కంట్రాస్టు ఏమిటంటే..? మాజీ ప్రధాని చంద్రశేఖర్ దగ్గర తను ఆర్థిక వ్యవహారాల సలహాదారు. ఆ కాలంలోనే మన ఆర్థిక వ్యవస్థ పాతాళంలోకి పడిపోయి, మన బంగారాన్ని కుదువపెట్టాల్సి వచ్చింది. తను చెప్పినా వినిపించుకునేవారెవరు నాటి పాలన వ్యవస్థలో? అదే మన్మోహన్ సింగ్ తిరిగి అదే బంగారాన్ని విముక్తం చేయడానికి, దేశ ఆర్థిక రథాన్ని గాడిన పడేయటానికి అహర్నిశలూ కష్టపడ్డాడు. అదీ తన తత్వం. పాలసీ డెసిషన్స్ తీసుకునేవాళ్లను బట్టి తన పనితీరు. అంతే.. నిజానికి పీవీ తనను వెలుగులోకి తీసుకొచ్చాడు అంటారు కానీ కాదు. మినిస్ట్రీ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ లలిత్ నారాయణ్ మిశ్రా తనను సలహాదారుగా తీసుకున్నాడు. అప్పటి నుంచే తను ఆర్బీఐ, ప్లానింగ్ కమిషన్ దాకా బోలెడు బాధ్యతలు నిర్వర్తించాడు. అంతకుముందు సీనియర్ లెక్చరర్, రీడర్, ఐక్యరాజ్యసమితికి కూడా వర్క్ చేశాడు తను. కాకపోతే పీవీ నరసింహారావు ఏకంగా తనను ఆర్థికమంత్రిగా తీసుకుని, కావల్సిన స్వేచ్ఛ ఇచ్చారు. మన్మోహన్ విధానాల్ని తను ప్రధానిగా డిఫెండ్ చేసుకునేవారు. ఆర్థిక సరళీకరణకు రథి పీవీ, సారథి మన్మోహన్‌సింగ్. సోనియా ప్రధాని కావాలని భావించినా దేశం యావత్తూ నిరసన చెప్పేసరికి. తను చెప్పినట్టు నడుచుకునే ఓ నాన్ కంట్రవర్సీ బ్యూరోక్రాట్ ప్రధాని కావాల్సివచ్చాడు ఆమెకు. సో, పేరుకు ప్రధాని తనే. కానీ అసలు ప్రధాని కార్యాలయం టెన్ జనపథ్..! తన పిల్లలు కూడా ఉన్నత విద్యావంతులు. ఎప్పుడూ ఎవరూ రాజకీయాల వాతావరణంలోకి రాలేదు. వర్తమాన రాజకీయ దుర్లక్షణాల వాసన కూడా సోకనివ్వలేదు. తక్కువ మాట్లాడాలి, ఎక్కువ పనిచేయాలి, దేశానికి ఏమైనా మంచి చేయాలి. అందుకే పెద్దగా మీడియా ముందుకు కూడా వచ్చేవాడు కాదు. మొత్తానికి భారత దేశ చరిత్రలో మన్మోహన్ సింగ్‌ది ఓ విశిష్ట అధ్యాయం..! వెరీ రేర్ పర్సనాలిటీ..! దేశానికి రెండో ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి కుటుంబం రాజకీయాలకు ఎంత దూరంగా ఉందో, మన్మోహన్‌సింగ్ కుటుంబం కూడా అంతే దూరం పాటించింది. శాస్త్రి ప్రధాని అయ్యాక తన కుమారుడు పని చేస్తున్న కంపెనీ ఆయనకు పదోన్నతి ఇచ్చిందని తెలుసుకున్న లాల్‌బహదూర్ ఆ ఉద్యోగానికి కొడుకు చేత రాజీనామా చేయించారని చదువుకున్నాం. మన్మోహన్ ఆర్థిక మంత్రి అయిన తర్వాత కూడా ఆయన భార్యాబిడ్డలు గోధుమ పిండి కొనుక్కోవడం కోసం ఆటోలో మార్కెట్‌కు వెళ్లేవారని కథనాలు చదివాం. వారసులు లేకుండా బ్రహ్మచారి జీవితం గడిపినవారు ప్రధానులైనా, రాష్ట్రపతులైనా నిజాయితీగా, నిష్టగా ఉండటం వేరు. కానీ మన్మోహన్‌సింగ్, లాల్‌బహదూర్ శాస్త్రిలాగా ఓ కుటుంబం ఉండి, వారికీ అభిలాషలు ఉండి నిజాయితీగా ఉండటం గొప్ప.

## దేశం గొప్ప మేధావిని కోల్పోయింది

(సత్యంన్యూస్, రాజాం)

భారత మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ మృతి చెందడం బాధాకరమని దేశం ఒక గొప్ప మేధావిని కోల్పోయిందని రాజాం రెడ్‌క్రాస్ చైర్మన్ కొత్తా సాయి ప్రశాంత్ కుమార్ తెలియచేశారు. ఈ సందర్భంగా శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో మన్మోహన్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ 1991లో ఆర్థికశాఖా మంత్రిగా ఉన్నప్పుడు మన్మోహన్ ప్రారంభించిన ఆర్థిక సంస్కరణల వలన భారతదేశ చరిత్రలో ముఖ్యుడిగా కీర్తి గడించారన్నారు. దేశానికి ఎన్నో సేవలందించిన వ్యక్తి ఈరోజున మన మధ్య లేక పోవడం చాలా బాధాకరమని జాతీయ యువజన అవార్డ్ గ్రహీత పెంకి చైతన్య కుమార్, మోటివేషనల్ స్పీకర్ బూరాడ శివకృష్ణ అన్నారు. జ్ఞానజ్యోతి విద్యాలయం కరెస్పాండెంట్ నడికుప్పల తారకేశ్వరరావు, కొత్తకోట కృష్ణమూర్తి, ఉరిటి శశి, రావాడ మధుబాబు, శ్రీకాంత్, ఉమలు పేర్కొన్నారు.




## అభ్యర్థులు దళారులను నమ్మి మోసపోవద్దు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



కానిస్టేబుళ్ల ఎంపిక ప్రక్రియలో దళారులను నమ్మి మోసపోవద్దని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అభ్యర్థులకు సూచించారు. ఈమేరకు గురువారం తన కార్యాలయంలో పోలీసు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఈనెల 30న ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వ్‌గ్రౌండ్‌లో ఏపీ పోలీసు రిక్రూట్మెంట్ బోర్డు ఆధ్వర్యంలో స్టైఫెండరీ సివిల్ పోలీసు కానిస్టేబుల్ (పురుషులు/ మహిళలు), ఏపీఎస్పీ పురుషులు పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలకు ప్రిలిమినరీ పరీక్షలో ఎంపికైన అభ్యర్థులకు ఫిజికల్ మేజేర్‌మెంట్ పరీక్ష (పీఎంటీ), ఫిజికల్ ఎఫిషయన్సీ పరీక్షలను (పీఈటీ) పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. 7390మంది అభ్యర్థులలో 6215 మంది పురుషులు, 1175 మంది స్త్రీలు పాల్గొంటున్నట్లు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నామన్నారు. దేహ దారుఢ్య పరీక్షలు నిర్వహించే ప్రదేశాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తామన్నారు. వైద్యపరమైన అంశాలలో పటిష్టమైన చర్యలు తీసుకున్నట్లు వివరించారు. అంబులెన్స్‌లు ఏర్పాటు చేయడంతోపాటు నిష్పక్షపాతంగా ఎంపికలు నిర్వహిస్తామన్నారు. ఈ పరీక్షలు ఈనెల 30 నుంచి వచ్చేనెల 18 వరకు నిర్వహిస్తామన్నారు. వీటిలో ప్రభుత్వ సెలవులు మినహాయిస్తామన్నారు.

### అభ్యర్థులు పాటించవలసిన నియమాలు, సూచనలు:

దేహదారుఢ్య పరీక్షలు అభ్యర్థులు తమతో పాటుగా అన్ని ఒరిజినల్ సర్టిఫికేట్లు మరియు (ఒక సెట్టు) అటస్టడ్ జిరాక్స్ ధృవీకరణ పత్రాలను తప్పనిసరిగా తీసుకొని రావాల్సి ఉంటుంది. వీటితోపాటు అన్ని ఒరిజినల్ సర్టిఫికేట్లు తీసుకురాకపోతే వారి అభ్యర్థిత్వాన్ని తిరస్కరిస్తారు. కాల్ లెటర్లో తెలిపిన స్కోరుకార్డ్ (ఒరిజినల్ రిసల్ట్), స్టేజ్-1 అప్లికేషన్, స్టేజ్-2 అప్లికేషన్‌లు తప్పనిసరిగా తీసుకురావాలి. దేహ దారుఢ్య పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు వారి వివరాలను వెరిఫికేషన్ సమయములో అధికారులకు విధిగా తెలియజేయాలి. అభ్యర్థిలు కాల్‌లెటర్‌లో తెలిపిన తేదీ, సమయానికి హాజరు కావాలి. నిర్ణీత సమయానికి అభ్యర్థి హాజరు కాని యెడల అభ్యర్థులను అనుమతించబడదు. స్నేహితులు, బంధువులు, కుటుంబసభ్యులను అనుమతించబడదు అభ్యర్థి ఒక్కరికి మాత్రమే మైదానంలోకి అనుమతిస్తారు.

### దళారులను నమ్మవద్దు

పోలీస్ కానిస్టేబుల్ రిక్రూట్మెంట్‌కు సంబంధించిన ఉద్యోగాలు ఇప్పిస్తామని ఆశ కల్పించే దళారీలు మాటలు నమ్మవద్దని ఎస్పీ సూచించారు. ఎవరైనా ఉద్యోగాలు ఇప్పిస్తామని, డబ్బులు ఇవ్వమని ప్రచారం చేస్తే వారి వివరాలను పోలీసులకు తెలపాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఈ సందర్భంగా ఎస్పీ తెలిపారు. అట్టి వివరాలు 6309990800, 6309990911 నెంబర్‌లకు తెలపాలని ఎస్పీ కోరారు. సమావేశంలో అదనపు ఎస్పీ కెవి రమణ, డీఎస్పీలు ఎం.అప్పారావు, డిఎస్ఆర్‌విఎస్ఎన్ మూర్తి, ఏవోసి హెచ్.గోపీనాథ్, సీఐ ఎం అవతారం, ఆర్ఐ నర్సింగరావు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.


## నెమలి పింఛంపై కనకమహాలక్ష్మీదేవి చిత్రం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



మార్గశిర మాసం నేపథ్యంలో నెమలి పింఛంపై శ్రీ కనకమహాలక్ష్మీ దేవి చిత్రాన్ని వాడాడ రాహుల్ పట్నాయక్ అపూర్వంగా వేశారు. కోరిన కోరికలు తీర్చే ఆ అమ్మవారంటే తనకు ఎంతో విశ్వాసమన్నారు. భక్తులకు కొంగుబంగారమై ఉన్న ఆ తల్లి చిత్రాన్ని అత్యంత శ్రద్ధాసక్తులతో రూపకల్పన చేశారు. శ్రీకాకుళం నగరానికి చెందిన రాహుల్ జాతీయ, అంతర్జాతీయస్థాయిల్లో ఎన్నో పురస్కారాలు పొందారు. పక్షుల వెంట్రుకలపై శ్రీనివాస కల్యాణం, శ్రీరామ పట్టాభిషేకం, శ్రీకృష్ణ రాసలీల ఘట్టాలతో పాటు సింహాద్రి అప్పన్న, ఈశ్వరుడు, వినాయకుడు తదితర చిత్రాలు వేశారు. అలాగే స్వామి వివేకానంద, భారతీయ చిత్రకారుడు రాజా రవివర్మ, ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా చిత్రాలను పక్షివెంట్రుకలపై అపురూపంగా వేశారు. పాఠశాలల గోడలపై ఎన్నో విద్యా సంబంధిత చిత్రాలను వేసి ప్రశంసలు పొందారు. గత రెండు దశాబ్దాలుగా లలితకళల్లో ఒకటైన చిత్రలేఖనానికి విశిష్ట సేవలందిస్తున్నారు. ఆయా రచయితల పుస్తకాలకు ముఖచిత్రాలు వేసి కళా ప్రియుల హృదయాలను దోచుకుంటున్నారు. బియ్యపు గింజలపై సయితం చిత్రాలను వేసి తన సత్తా చాటుకుంటున్నాడు. అమెరికా బుక్ ఆఫ్ వరల్డ్, రావా బుక్ ఆఫ్ వాల్ రికార్డ్స్, ఆస్కార్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్, హైరేంజ్ వరల్డ్ రికార్డ్స్, గ్రేట్ ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్, లండన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్, గిన్నీస్ బుక్‌లో స్వర్ణ పతకం సాధించాడు. ఈ రికార్డులలో సముచిత స్థానం పొందాడు. పక్షుల వెంట్రుకలపైన, బియ్యపు గింజలపై వేసిన చిత్రాలకు గాను ఈ అవార్డులను సొంతం చేసుకున్నాడు. మరో విశేషమేమంటే రాహుల్ పక్షుల ప్రేమికుడు. వివిధ జాతులకు చెందిన 35 పక్షులను పెంచుతున్నాడు. వాటిని పోషిస్తూ సంరక్షణ బాధ్యతలను చేపట్టిన రాహుల్ అభినందనీయుడు.




## మోదీ బయోపిక్ ఫ్లాప్..

# మన్మోహన్ బయోపిక్ హిట్!

భారతదేశాన్ని ప్రస్తుతం పరిపాలి స్తున్న ప్రధాని నరేంద్ర మోదీపై ఎన్నో బయోపిక్‌లు తెరకెక్కాయి. కానీ అవేవీ ఆశించిన ఫలితాన్ని వ్వలేదు. వివేక్ ఒబెరాయ్ ఇంతకు ముందు మోదీ బయోపిక్‌లో నటించగా పలు భాషల్లో విడుదలైన సంగతి తెలిసిందే. పి.ఎం. నరేంద్ర మోదీ పేరుతో వచ్చిన ఈ బయోపిక్ ప్రజల్ని అంతగా అలరించలేకపోయింది. కానీ మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ జీవితం ఆధారంగా తెరకెక్కిన బయోపిక్ ఊహించని రీతిలో పెద్ద విజయం అందుకుంది. ఈ సినిమా అనేక వివాదాలను తెర పైకి తెచ్చింది. రాజకీయంగా ప్రకంపనాలు సృష్టించింది. దీంతో వివాదాలతో ప్రచారం కలిసొచ్చి సినిమా పెద్ద హిట్టయింది. మన్మోహన్ జీవితం ఆధారంగా బాలీవుడ్ బయోపిక్ ది యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్ ఐదేళ్ల క్రితం విడుదలైంది.

ఈ చిత్రంలో సింగ్ ప్రధానమంత్రిగా ఉన్న కాలాన్ని తెరపై ఆవిష్కరించారు. ఆయనను 'రిమోట్-కంట్రోల్డ్' ప్రధానమంత్రిగా చిత్రీకరించడం సహా ప్రతిదీ వివాదంగా మారింది. యుపిఎ ప్రభుత్వ హయాంలో జరిగిన సంఘటనలను ఈ చిత్రంలో చూపించిన కారణంగా వివాదాలు చుట్టుముట్టాయి. సినిమాలో మన్మోహన్ సింగ్‌ను సోనియా గాంధీ ఎక్కువగా ప్రభావితం చేసినట్లు చూపించడం కాంగ్రెస్ పార్టీకి కోపం తెప్పించింది. సోనియా గాంధీ కుమారుడు రాహుల్ గాంధీ కోసం మన్మోహన్‌ను ఎలా పక్కన పెట్టారో కూడా తెరపై చూపించడం తీవ్ర చర్చకు దారితీసింది. ఈ సినిమాలో కొన్నిటిని రాజకీయ ప్రత్యర్థులు తమ విమర్శలలో తరచుగా ఉపయోగించే అంశాలనే చూపారు. ఈ చిత్రం సింగ్‌ను తప్పుగా చిత్రీకరించిందని కాంగ్రెస్ నాయకులు సీరియస్ అయ్యారు. పార్టీ అభ్యంతరాలు లేవనెత్తింది. అయితే ఈ వివాదాలే సినిమా విజయానికి కలిసొచ్చాయి. మూవీలో ఏం ఉందో చూడాలన్న ఉత్సుకతతో జనం థియేటర్లకు వచ్చారు. అలా మన్మోహన్ సింగ్ బయోపిక్ పెద్ద తెరపై హిట్ కొట్టింది. ది యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్‌లో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ పాత్రలో దిగ్గజ నటుడు అనుపమ్ ఖేర్ నటించారు. సింగ్ సిగ్నేచర్ మార్క్ హావభావాలు, రూపం, మాట్లాడే విధానంతో అనుపమ్ పాత్రకు జీవం పోసారు. నిజంగా రాజనీతిజ్ఞుడైన మన్మోహన్ కి మరో ఆప్షన్ లేదు అనేంతగా అనుపమ్ రక్తి కట్టించారని ప్రజలు ప్రశంసించారు. ఖేర్ అసాధారణమైన నటనకు గొప్ప ప్రశంసలు దక్కాయి. ఈ చిత్రంలో సోనియాగాంధీగా సుజానే బెర్నెర్ట్, రాహుల్ గాంధీగా అర్జున్ మాథుర్ , ప్రియాంక గాంధీగా అహానా కుమ్రా తమ పాత్రలలో చెప్పుకోదగ్గ నటనతో ఆకట్టుకున్నారు. విజయ్ గుట్టే దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని సునీల్ బోహ్రా- ధావన్ నిర్మించారు. 18 కోట్ల బడ్జెట్ తో తెరకెక్కిన ఈ సినిమా ప్రపంచ వ్యాప్తంగా 31 కోట్ల రూపాయలను వసూలు చేసింది.

- తుపాకి.కామ్ సౌజన్యంతో...

రకుల్‌ప్రీత్‌సింగ్..

## హీటెక్కిస్తోంది!!



రకుల్ ప్రీత్ సింగ్ తన లేటెస్ట్ ఫోటోషూట్‌తో మరోసారి నెటిజన్లను ఆశ్చర్యపరిచింది. పికాక్ మ్యాగజైన్ డిసెంబర్ 2024 కవర్‌కి ప్రత్యేకంగా దిగిన ఫోటోలో రకుల్ మెరిసిపోయింది. ఈ ఫోటోలో ఆమె గ్లామర్, గ్లాసీలుక్, గ్రేస్ అన్నీ కలగలిపి ఒక కొత్త అందం ప్రదర్శించింది. తన ప్రత్యేకమైన స్టైల్ స్టేట్మెంట్‌తో ప్రతిసారీ ఆకట్టుకునే రకుల్, ఈసారి మరింత అందంగా కనిపించింది. సెక్విన్ డ్రెస్‌లో ఆమె హై-ఫ్యాషన్ లుక్ ఫ్యాషన్ లవర్స్‌కి స్ఫూర్తిగా నిలిచింది. ఆమె ఈ ఫోటోకి ఇచ్చిన కామెంట్ కూడా చాలా ఇన్స్పైరింగ్‌గా ఉంది. "సినిమాలు నటుల కోసం మాట్లాడతాయి. బాక్సాఫీస్ ఫలితాలు అనిశ్చితమైనవైనా, సినిమాను ప్రేక్షకులు ప్రేమిస్తే అదే అసలు విజయం," అంటూ తన నటనా ప్రయాణం గురించి రకుల్ తన అభిప్రాయాన్ని పంచుకుంది. ఈ మాటలు ఫ్యాన్స్‌కి కేవలం ప్రేరణగా కాకుండా, ఆమెకు సినిమా మీదున్న ప్యాషన్‌ను హైలైట్ చేశాయి. రకుల్ ప్రీత్ కెరీర్ విషయానికి వస్తే, తెలుగులో కెరటం సినిమాతో ప్రారంభం అయ్యింది. ఇక వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్‌తో బ్రేక్ పొందింది. ఆ తర్వాత స్టార్ హీరోలతో జోడీకట్టి స్టార్ హీరోయిన్‌గా ఎది గింది. తెలుగులో ఎన్టీఆర్, రామ్ చరణ్, అల్లు అర్జున్ వంటి టాప్‌స్టార్స్‌తో సినిమాలు చేస్తూ దూసుకుపోయింది. ఆ తర్వాత ఆమె తమిళంలో అడుగుపెట్టి, అక్కడ కూడా తనకంటూ ఓ గుర్తింపును సంపాదించింది. ప్రస్తుతం బాలీవుడ్‌లో బిజీగా ఉంది.

ఇన్‌స్టాగ్రామ్‌లో 23 మిలియన్స్ ఫాలోవర్స్ కలిగిన రకుల్, తన స్టైలిష్ లుక్స్, ఫిట్‌నెస్ టిప్స్ పంచుకుంటూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటుంది. తాజా ఫోటోలో ఆమె గ్లామర్ మాత్రమే కాకుండా, తన వ్యక్తిత్వం, ధైర్యం, ఆత్మవిశ్వాసం కూడా చాటిచెప్పింది. "మాటల్లో కాకుండా, పనిలోనే నమ్మకం," అనే విధంగా ఆమె చూపించే ప్రతి లుక్ ఒక కొత్త మెసేజ్‌ను అందిస్తుంది. ఈ ఫోటోషూట్‌తో రకుల్ ప్రీత్ సింగ్ మరోసారి గ్లామర్ క్వీన్ అని ప్రూవ్ చేసింది, ఇక ప్రస్తుతం అమ్మడు మరో సాలిడ్ సక్సెస్ కోసం ఎదురు చూస్తోంది. ఆమె నుంచి చివరగా వచ్చిన ఇండియన్ 2 పాన్ ఇండియా బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్‌గా నిలిచింది. అలాగే అంతకుముందు వచ్చిన సినిమాలు కూడా పెద్దగా సక్సెస్ కాలేదు. ప్రస్తుతం బాలీవుడ్‌లో ఒక సినిమా చేస్తోంది. తెలుగులో కూడా అవకాశాల కోసం ఎదురుచూస్తోంది. మరి అమ్మడికి నెక్స్ట్ బ్రేక్ ఇచ్చే సినిమా ఏదవుతుందో చూడాలి.

- తుపాకి.కామ్ సౌజన్యంతో...

ఎంత నిశ్శబ్దంగా రాజకీయాల్లోకి వచ్చాడో ఎలాంటి హంగూ, ఆర్భాటం లేకుండా తనలాగే, అంతే నిశ్శబ్దంగా అదే రాజకీయాల నుంచి నిష్క్రమించాడు. విమర్శకులు ఆయన్ను ఉత్తి మరబొమ్మ అన్నారు. సీటుపై తానున్నా.. స్టీరింగ్ తన చేతిలో లేదని ఆడిపోసుకునేవారు. లీడర్ షిప్ క్వాలిటీస్ లేవని ఆయనదో సీతవో తరహా పాలనా అనీ ఆరోపించారు. అయినా, దేశంలోనే అత్యంత శక్తివంతమైన పదవిలో ఉండి కూడా.. స్థితప్రజ్ఞతకు సిగ్నేచర్‌లా ఎక్కడా మాట తూలలేదు. భారత రాజకీయాల్లో విలువలు, సంస్కారం ఈ రోజుల్లో ఎక్కడా అని ప్రశ్నించేవారికి వాటికే ప్యాంట్, షర్ట్ వేసి చూపిస్తూ ఇదిగో ఆ విలువ, ఆ సంస్కారానికి నిలువెత్తు రూపమని ఆయన్ను చూపించొచ్చు. చాలాసార్లు ఆయన మౌనమే ఎన్నో మాటలను మించిన జగ్గరతనమై పనిచేసింది. అలాంటి భారత ఆర్థిక సంస్కర్త.. యావత్ భారతాన్ని దిగ్భ్రాంతికి గురిచేస్తూ కన్నుమూసిన వేళ కాస్త చెప్పుకోవాలి.



# సింగ్ ఈజ్ కింగ్!

మీడియా, ప్రతిపక్షాల కంటే కూడా.. తనేంటో తాననుసరించిన బాట చెబుతుందని అందుకు తన పదవీకాలం ఓ చరిత్రగా మిగిలి పోతుందన్నారు డాక్టర్ మన్మోహన్ సింగ్. బలహీనమైన ప్రధాని అని తనపై వచ్చిన విమర్శలకు గతంలో ఆయన అదే మీడియాకు చెప్పిన మాటలివి. రీసెంట్‌గా ఏప్రిల్ 2, 2024న తన 33ఏళ్ల రాజ్యసభ సభ్యత్వానికి ఇక వీడ్కోలు పలుకుతూ.. 91ఏళ్ల వయస్సులో రిటైర్మెంట్ తీసుకున్నారు. ఏనాడూ ప్రత్యక్ష రాజకీయాల్లో దిగువ సభకు ఎన్నిక కాని మన్మోహన్. అయితేనేం..? భారతరత్న, దివంగత ప్రధానైన పాములపర్తి వెంకట నర్సింహారావు వంటివారు కూడా మన్మోహన్ లాంటివారు కావాలని కోరకుండా.. ఏకంగా మన్మోహనే కావాలని ఏరికోరి తన క్యాబినెట్‌లో ఆర్థికమంత్రిత్వశాఖను అప్పజెప్పడం.. ఆర్థికరంగంలో మన్మోహన్ జ్ఞానకుశలతను.. పైగా ఆయన మెచ్యూరిటీ లెవల్స్‌ను పట్టిచూపించేవి.

ఒక విద్యావేత్త.. రాజకీయ నాయకుడైతే ఎలా ఉంటుందో చెప్పాలంటే ఓ ఉదాహరణ మన్మోహన్ సింగ్. ఒక బ్యూరో క్రాట్ ఎలా ఉండాలో చెప్పాలంటే నిదర్శనం మన్మోహన్ సింగ్. ఆర్థిక సరళీకరణలకు ఆద్యుడైన పీవీసాబుకు.. అన్నివిధాలా సలహాదారుడిగా మార్గాన్ని సుగమం చేసిన ఆర్థికవేత్త. ఎన్ని విమర్శలెదురైనా 1991 ఆర్థిక సంస్కరణలతోపాటు మన్మోహన్ సింగ్ ప్రధానిగా పనిచేసిన హయాంలో తీసుకొచ్చిన కొన్ని పథకాలు కోట్ల మంది ప్రజలకి పట్టెడన్నం పెడుతున్నాయి.

## 1991 ఆర్థిక సంస్కరణలపై మన్మోహన్ ముద్ర!

అప్పటికే ఆర్థిక సంక్షోభం ఎదుర్కొంటున్న వేళ.. 1991లో ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టిన భారత ఆర్థిక మంత్రి మన్మోహన్ సింగ్. ఈ శతాబ్ద కాలంలో భారతదేశం గర్వించదగ్గ సంస్కర్తల్లో గొప్పవారిగా ముగ్గురి పేర్లను.. రామచంద్ర గుహ వంటి విశ్లేషకలు, రచయిత వెల్లడించగా.. అందులో మొదటి పేరు మన్మోహన్ సింగ్ దేనంటే నమ్మగలమా..? 18 పరిశ్రమలు మినహా.. మిగిలిన పారిశ్రామిక పాలసీలో లైసెన్స్ రాజ్‌కు స్వస్తి పలికిన వ్యక్తి డాక్టర్ సింగ్. పరిశ్రమల్లో 51% వరకు విదేశీ ఈక్విటీ వాటాను అనుమతిస్తూ.. విదేశీ పెట్టుబడులను ప్రోత్సహించాడు. ఈ లిబరలైజేషన్.. మొత్తంగా భారత ఆర్థిక వ్యవస్థ స్వరూపాన్నే పూర్తిగా మార్చేసింది. ఖాళీ బిందెలా తయారైన భారత ప్రభుత్వ ఖజానాను.. ఆర్థిక సంక్షోభం నుండి గట్టెక్కించి భావిభారత ఆర్థిక వృద్ధి రేటుకు మార్గాన్ని సుగమం చేసింది.

## 2004 నుంచి 2014 వరకు ప్రధానమంత్రిగా డాక్టర్ సింగ్!

2004లో బీజేపీ కంటే కేవలం 7సీట్ల మెజార్టీని మాత్రమే కనబర్చిన కాంగ్రెస్ పార్టీ తన యునైటెడ్ ప్రోగ్రెసివ్ అలయెన్స్ పేరుతో.. సమాజ్‌వాదీ, రాష్ట్రీయ జనతాదళ్ వంటి ప్రాంతీయ పార్టీల మద్దతుతో, వామపక్ష పార్టీలు అలయెన్స్ లో చేరకుండా బయట నుంచి తెలిపిన సంఘీభావంతో.. 543 సీట్లకుగాను.. 335 మంది సభ్యులతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే ఎవ్వరూ ఊహించని విధంగా.. ఎందరో కురవృద్ధ పేరుగల నేతలు ప్రయత్నించినా ఫలితం లేకుండా.. దేశం మొత్తాన్నీ ఆశ్చర్యపర్చే పేరు ప్రధానమంత్రిగా తెరపైకొచ్చింది. అలా సోనియా అభీష్ఠం మేరకు మన్మోహన్ సింగ్ ప్రధాన మంత్రి పీఠాన్నధిరోహించాడు. 2009 ఎన్నికల నాటికి కాంగ్రెస్ పుంజుకుంది. 206 సీట్లను గెల్చుకుంది. బీజేపీ కేవలం 116 సీట్లతో సరిపెట్టుకుంది. ఆంధ్రప్రదేశ్, కేరళ, మహారాష్ట్ర, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్ వంటి రాష్ట్రాల్లో మెజార్టీ లోక్‌సభ సీట్లను గెల్చుకుని ఐదేళ్ల టర్మ్ తర్వాత జవహర్ లాల్ నెహ్రూ తర్వాత అత్యధిక మెజార్టీతో మళ్లీ ప్రధానైన వ్యక్తిగా మన్మోహన్ సింగ్ ఈజ్ కింగ్ అనిపించుకున్నాడు. ఆ టర్మ్‌లో మన్మోహన్ తీసుకొచ్చిన కొన్ని అద్భుత పథకాల్లో ఇవాళ ప్రధానంగా చెప్పుకోవాల్సింది మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం. ఆ పథకం కింద కోట్లమంది ఇవాళ దేశంలో పనిచేస్తూ డబ్బు సంపాదించుకుంటున్నారు. అంతేకాదు, వివిధ రంగాల్లో నష్టాలు వచ్చినప్పుడు.. రైతులు, రైతుకూలీలు, ఇతర వర్గాల వారికీ ఉపాధి హామీ బాసటగా నిలుస్తున్న దృశ్యాలు కొల్లలు. మొత్తంగా మన్మోహన్ పీరియడ్‌లో తీసుకువచ్చిన గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని కొట్టే పథకం ఇంతవరకూ భారతదేశ చరిత్రలోనే ఎవరూ తీసుకురాలేదంటే కూడా అతిశయోక్తి కాదేమో..?! అలాగే, సింగ్‌సాబ్ ప్రవేశపెట్టిన అతి గొప్ప పథకాల్లో జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ గురించి కూడా ప్రధానంగా చెప్పుకోవాల్సిందే! విద్యా, వైద్యం మౌలిక అవసరాలుగా మారిన గ్రామీణ ప్రాంతాల్లో ముఖ్యంగా మహిళలు, పిల్లలకు నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ సేవలను అందించడానికి ప్రవేశపెట్టిందే ఎన్‌హెచ్‌ఆర్‌ఎం 2013లో, ఈ పథకం జాతీయ ఆరోగ్య మిషన్‌గా పేరు మార్చుకుని.. పట్టణ ప్రాంతాలకు కూడా విస్తరించింది. బలహీన వర్గాల ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ అవసరాలను తీర్చే గొప్ప పథకంగా మన్మోహన్ దూరదృష్టిని ఆ స్కీమ్‌తో అంచనా వేయొచ్చు. అలాగే, రైట్ టూ ఎడ్యుకేషన్ కూడా కీలక పథకంగా చెప్పుకోవాలి. విద్యా హక్కు చట్టం ప్రకారం 6 నుంచి 14 ఏళ్ల పిల్లలకు ఉచిత నిర్బంధ విద్య పథకాన్ని తీసుకొచ్చి.. విద్యావసరాన్ని చాటిచెప్పిన విద్యావేత్త మన్మోహన్ సింగ్. మరో పథకం పౌరుల చేతిల్లో పాశుపతాస్త్రంగా మారిన రైట్ టూ ఇన్ఫర్మేషన్ యాక్ట్ వంటివెన్నో సింగ్ విజయాల్లో కీలకమైనవి. యూపీఏ వన్, యూపీఏ 2 హయాంలో.. 2004 నుంచి 2013 వరకు భారతదేశ జీడీపీ ప్రతి యేడూ సగటు రేటు 7.74%గా కొనసాగింది. 2008లో ఒప్పందం కుదుర్చుకున్న ఇండో-యుఎస్ న్యూక్లియర్ డీల్ కూడా ప్రత్యేకమైంది. 2008లో, యూఎస్ భారతదేశం పౌర అణు ఒప్పందంపై సంతకం ఇరు దేశాల నేతలు సంతకాలు చేశారు. పౌర అవసరాలకు, మిలిటరీ అవసరాలను వేరు చేస్తూ ఈ ఒప్పందం జరిగింది. అంతర్జాతీయ అణుశక్తి సంస్థ (ఐఏఈఎ) రక్షణ కింద అన్ని పౌర సౌకర్యాలను అందించేందుకు భారత్ అంగీకరించింది. దాంతో భారతదేశంలో పౌర సౌకర్యాల్లో పూర్తి సహకారానికి యూఎస్ అంగీకరించింది. దాంతో న్యూక్లియర్ సప్లయర్స్ గ్రూప్ (ఎన్‌ఎస్‌జీ) నుంచి భారత్ మినహాయింపును కూడా పొందింది. ఈ వెసులుబాటుతో ఇండియా ఆ తర్వాత ఇతర దేశాల నుంచి అణు సాంకేతికతతో పాటు ఇంధనాన్ని కొనుగోలు చేసే అవకాశాల్ని చేజిక్కించుకుంది. అయితే, పైవన్నీ మన్మోహన్ సర్కార్‌లో నాణానికి ఒకవైపు కనిపించే విజయాలైతే మరకలూ అదే స్థాయిలో ఆ ప్రభుత్వాన్ని వెంటాడాయి. నవంబర్ 26, 2008న ముంబైలో జరిగిన తీవ్రవాద దాడి.. అదే మన్మోహన్ సర్కార్ ఇంటెలిజెన్స్ వైఫల్యాన్ని కళ్లకు కట్టింది. పది మంది ఉగ్రవాదులు భారత దేశ ఆర్థిక రాజధానిలోకి ప్రవేశించి.. ముంబై మహా నగరంలో 12చోట్ల కాల్పులు, బాంబు దాడులకు తెగబడితే.. 166మంది మరణించారు. సుమారు 300మంది గాయపడ్డ ఆ ఘోర ఘటన ఓ మహా విషాదాన్ని మిగిల్చింది. ఇక యూపీఏ ప్రభుత్వం సెకండ్‌టర్మ్‌లో.. బయటపడ్డ 2010 కామన్ వెల్త్ గేమ్స్ స్కామ్, 2జీ స్పెక్ట్రమ్ కుంభకోణం, బొగ్గు బ్లాకుల కేటాయింపులకు సంబంధించిన స్కామ్స్ వంటివెన్నో.. నాటి మన్మోహన్ ప్రభుత్వంపై అవినీతి మరకలకు కారణమయ్యాయి.

## అన్నాహజారే నిరసనతో మన్మోహన్ సర్కార్ పై పెరిగిన ఒత్తిడి

అవినీతి వ్యతిరేక ఉద్యమకారుడిగా కేజ్రీవాల్ వంటివారితో కలిసి అన్నా హజారే 2011 ఏప్రిల్ లో జన్‌లోక్‌పాల్ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని.. చట్టం తీసుకురావాలని.. ఢిల్లీలోని రాంలీలా మైదాన్‌లో ప్రారంభించిన నిరసనే యూపీఏకు భారత్‌లో నూకలు చెల్లేలా చేయడంలో కీలకపాత్రైంది. ఆ ఉద్యమానికి నాడు అన్ని వర్గాల ప్రజల నుంచి పెద్ద ఎత్తున మద్దతు లభించింది. దానికి తోడు యూపీఏ ప్రభుత్వ రెండోటర్మ్‌లో.. అధిక ద్రవ్యోల్బణ రేట్లతో జనసామాన్యంపై ఆ ప్రభావం అమితంగా పడింది. ద్రవ్యోల్బణం రెండంకెలకు పెరిగింది. ఇతర నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలలోనూ.. ఎల్‌పీజీ ధరల పెరుగుదలతోనూ.. నాడు ప్రధాన ప్రతిపక్షమైన బీజేపీ.. మన్మోహన్‌సింగ్ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టగల్గడంలో సక్సెస్ అయ్యింది. వీటికి తోడు.. 2012లో న్యూఢిల్లీలో ఓ బస్సులో జరిగిన సామూహిక అత్యాచార ఘటన.. దేశం మొత్తాన్నీ కుదిపేసింది. 23ఏళ్ల యువతి మృతి చెందిన ఘటన.. మహిళ భద్రతపై చర్చకు తెరలేపింది. అదే ఆ తర్వాత నిర్భయ కేసుగా మనం చెప్పుకుంటున్నాం.

మన్మోహన్ తన దూరదృష్టితో గత ఏ ప్రధానులకు తీసిపోకుండా.. ఒకింత ఎక్కువ గుణాత్మకమైన పథకాలనే ప్రవేశపెట్టినా కర్ణుడి చావుకు వేయి కారణాలన్నట్టు యూపీఏ హయంలో జరిగిన కుంభకోణాలు, ఇతర విషయాలెన్నో నేరుగా ఆయన ప్రమేయం లేకపోయినా.. యూపీఏ-2కు చెడ్డపేరు తెచ్చిపెట్టాయి. ఆ సమయంలోనే ఆయన్ను చాలామంది.. ముఖ్యంగా ప్రతిపక్ష బీజేపీ వంటి పార్టీలు రిమోట్ కంట్రోల్ పీఎం అంటూ సంబోధించేందుకు కారణమయ్యాయి. ఏదేమైనా తన మొత్తం కెరీర్ లో విజయాలకు పొంగిపోకుండా అపజయాలకు, విమర్శలకు లొంగిపోకుండా తన పొలిటికల్ కెరీర్‌ను దిగ్విజయంగా ముగించిన మౌన ముని మన్మోహన్ సింగ్. అందుకే సింగ్ ఈజ్ కింగ్.


## ఆధునిక భారత వాస్తుశిల్పి.. మౌనమునికి శ్రద్ధాంజలి

- బాతాఖానీ.కామ్ సౌజన్యంతో...

# యువతకు ఆదర్శం ఎం.వి.వి.ఎస్.శాస్త్రి

(సత్యంన్యూస్, బూర్జ)

సుమారు 2500 పైచిలుకు డిగ్రీలను పూర్తిచేసిన ఎం.వి.వి.ఎస్. శాస్త్రి నేటి యువతకు ఆదర్శంగా నిలిచారని బూర్జ వైస్.ఎంపిపి బుడుమూరు సూర్యరావు, తొగరాం నీటి సంఘం అధ్యక్షులు, కళింగ సంక్షేమ సేవాసంఘం జాతీయ గౌరవ అధ్యక్షులు బుడుమూరు శ్రీరామమూర్తిలు పేర్కొన్నారు. గురువారం శాస్త్రికి వారి చేతుల మీదుగా సన్మానం చేశారు. ఆన్లైన్, ఆఫ్లైన్ పద్ధతుల్లో శాస్త్రి తన చదువులు పూర్తి చేశారన్నారు. ఎం.వి.వి.ఎస్.శాస్త్రి రెండేళ్ల కాల వ్యవధిలో 2500 కోర్సులు పూర్తిచేసి ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్, రెండు తెలుగు రాష్ట్రాల రికార్డులు, తెలుగుబుక్ ఆఫ్ రికార్డ్సలలో ఎం.వి.వి.ఎస్.శాస్త్రి పేరు నమోదయిందన్నారు. తగిన అర్హతలు వుండడంతో గిన్నిస్‌బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ఎం.వి.వి.ఎస్.శాస్త్రి పేరు ప్రతిపాదించామన్నారు.



నగరంలోగల కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో దేశ మాజీ ప్రధానమంత్రి ఆర్థిక సంస్కరణలకు మూల పురుషుడైన డాక్టర్ మన్మోహన్ సింగ్‌కు ఘన నివాళి అర్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.శివశంకర్, వైస్ ప్రిన్సిపాల్ కె వేణు, ఎన్ఎస్ఎస్ పిఓ ఎల్ మోహనరావు, ఉపాధ్యాయ సిబ్బంది,విద్యార్థినిలు పాల్గొన్నారు. - సత్యంన్యూస్, శ్రీకాకుళం



# ప్రమాదాలు నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లాల్లో రహదారి ప్రమాదాలు నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి పోలీసు అధికారులకు దిశ నిర్దేశం చేశారు. గురువారం శ్రీకాకుళం, కాశీబుగ్గ సబ్ పోలీసు డివిజన్ పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా, జిల్లా పోలీసు కార్యాలయంలో టెక్కలి సబ్ డివిజన్ పోలీసు అధికారులతో రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన చర్యలు, సదరు కేసులు నమోదు, దర్యాప్తు తదితర ముఖ్యమైన అంశాలపై జిల్లా ఎస్పీ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ క్రమంలో ముందుగా ఎస్పీ ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలో రహదారి ప్రమాదాలకు సంబధించిన కేసులు వివరాలు, తరుచు ప్రమాదాలు ప్రదేశాలను, ప్రమాదాలు నివారణకు తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్న బ్లాక్‌స్పాట్ జోన్స్‌ను గుర్తించి, వాహన చోదకులకు, ప్రజలకు బ్లాక్‌స్పాట్‌లపై అవగాహన కల్పించాలని, విజబుల్ పోలీసింగ్‌లో భాగంగా విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించి రహదారి భద్రత నియమాలు పాటించని వారిపై జరిమానాలు విధించాలన్నారు. ప్రధాన చెక్‌పోస్టుల వద్ద వేకువ జామున ఫేస్‌వాష్ కార్యక్రమం చేసి ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వర్క్స్ ముఖ్యకూడలి వద్ద పెంచాలన్నారు. వాహనదారులకు అర్థమయ్యే విధంగా ప్రమాద హెచ్చరిక బోర్డులు, ప్రమాదాల నివారణ సైనింగ్‌బోర్డ్స్ ఏర్పాటు చేయాలని, రేడియం స్టిక్కర్స్, రోడ్డుపై పెయింటింగ్ సోలార్ బ్లింకర్స్ వంటివి ఏర్పాటు చేయడానికి సంబంధిత శాఖా అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రమాద నివారణ చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు సూచించారు. ట్రాఫిక్ నియమ, నిబంధనలపై, ద్విచక్ర వాహనదారులు ప్రామాణికత కలిగిన హెల్మెట్‌లను ధరించటంపై, అతివేగం, ర్యాష్ డ్రైవింగ్, ట్రిపుల్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి అవగాహన కల్పించాలని అధికారులకు ఎస్పీ తెలిపారు. మైనర్లకు వాహనాలు ఇస్తే వారు ఏదైనా ప్రమాదం చేస్తే, సదరు యజమానిపై కూడా కేసు నమోదు చేస్తామని, మద్యం తాగి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులతో రవాణా చేయరాదని అవగాహన కల్పించాలన్నారు. జిల్లావ్యాప్తంగా గుర్తించిన బ్లాక్‌స్పాట్స్, ఆక్సిడెంట్ ప్రోన్ ఏరియాల వద్ద బ్యారికేడింగ్, ప్రమాద సంకేత సూచిక బోర్డులు, స్టాపర్స్, సిగ్నల్ లైట్స్, బ్లింకింగ్ లైట్స్, ఏర్పాటు చేసుకోవాలని, రోడ్డు మలుపులు, జంక్షన్లు, ప్రమాదాలు జరిగే ప్రదేశాల్లో వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని ఎస్పీ ఈ సందర్భంగా సూచించారు. ఈ సమీక్షలో ఎఎస్పీ కేవీ రమణ, డీఎస్పీ డి.ఎస్.ఆర్. వి.ఎస్.ఎన్ మూర్తి, టెక్కలి సబ్ డివిజన్ పోలీసు అధికారులు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శ్రీకాకుళం,కాశీబుగ్గ సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# బలవంతపు భూసేకరణ వద్దు

(సత్యంన్యూస్, పలాస)

రాష్ట్ర ప్రభుత్వం కార్గో ఎయిర్‌పోర్టు పేరుతో ప్రజల ఆస్తులను కార్పొరేట్ ఆస్తులుగా మార్చితే సహించేది లేదని వామపక్ష నాయకులు సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సీపీఐ కార్యదర్శి చాపర వేణు, సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు, సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి తామాడ సన్యాసిరావు, పోతనపల్లి వాసులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శుక్రవారం స్థానిక కళ్యాణ మండపంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో వచ్చేనెల 6న పలాస ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా జరపాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బలవంతపు భూసేకరణ ఎందుకు చేస్తున్నారో కేంద్ర పౌరవిమాన యాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రజలకు సమాధానం చెప్పాలని వారి డిమాండ్ చేశారు. ప్రజల భూములను కార్పొరేటర్లకు కట్టబెట్టడం ఎందుకు చేస్తున్నారని వారు ప్రశ్నించారు. మూలపేట పోర్టు కోసం రాష్ట్ర ప్రభుత్వం సేకరించిన 2,270 ఎకరాలు భూమిలో 300 ఎకరాలు కార్గో ఎయిర్‌పోర్టుకు కేటాయిస్తే సరిపోతుందని, ఎటువంటి భూసేకరణ అవసరం లేదన్నారు. మూలపేట పోర్టు సరుకులు రవాణాకు పోర్ట్‌లోనే ఎయిర్‌పోర్ట్ నిర్మించాలని వారు సూచించారు. అభివృద్ధి ముసుగులో ప్రజల ఆస్తులను కార్పొరేట్ ఆస్తులుగా మార్చేస్తున్నారని వారు విమర్శించారు. కార్గో ఎయిర్‌పోర్ట్ భూసేకరణ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు పోతనపల్లి వాసు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కె.మోహనరావు, తెప్పల అజయ్‌కుమార్ ఆంధ్రప్రదేశ్ జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్, యం.తులసయ్య, ఎ.గున్నయ్య, కోర్నాన బాలాజీరావు ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం మండల అధ్యక్షులు, ఎ.పర్శరాం, డి.మోహన్, జి.లోకనాదం, యం.కృష్ణారావు, పి.యోగేష్ తదితరులు పాల్గొన్నారు.




డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పని చేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను.
CONTACT:
9440001447, 8341163666

ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

మెట్రో సోఫా వర్క్స్
అన్ని రకముల సోఫాలు, ఫర్నిచర్ మేనుఫేక్చర్స్ (హోల్‌సేల్ & రిటైల్)
షాపు నెంబరు 1, కొన్నవీధి, వన్‌వే ట్రాఫిక్ రోడ్డు, మాధవ మోటార్స్ దరి, శ్రీకాకుళం
సెల్: 83094 81129

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE
WOMEN'S COLLEGE ROAD,
SRIKAKULAM - 532 001

## మన్మోహన్‌సింగ్ మృతి బాధాకరం



(సత్యంన్యూస్, టెక్కలి)

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి బాధాకరమని, భారత దేశం ఒక ధృవతారను కోల్పోయిందని కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి పేర్కొన్నారు. ఈమేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దేశంలో నూతన ఆర్థిక సంస్కరణలు చేపట్టిన వ్యక్తిగా మన్మోహన్ సింగ్ చరిత్రలో నిలిచిపోతారని, పదేళ్ల పాటు భారత ప్రధానిగా సేవలందించిన మన్మోహన్ సింగ్ మృతి కాంగ్రెస్ పార్టీకే కాదు దేశానికే తీరని లోటని అన్నారు. ఆర్థిక మంత్రిగా ఆయన ఆర్థిక సంస్కరణల స్థిరప్రజ్ఞుడు, ప్రధానమంత్రిగా ఆయన దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## 'పరీక్ష పే చర్చ'పై అవగాహన సదస్సు



(సత్యంన్యూస్, నరసన్నపేట)

విద్యార్థుల్లో పరీక్షల భయాన్ని పోగొట్టేందుకు ప్రధాని నరేంద్ర మోడీ ప్రతీ యేటా 'పరీక్షా పే చర్చా' కార్యక్రమం నిర్వహిస్తున్నారని, ఈ కార్యక్రమంలో విద్యార్థులందరూ పాల్గొనాలని మండల విద్యా శాఖ అధికారి యు.శాంతారావు అన్నారు. శుక్రవారం స్థానిక పద్మావతి జూనియర్ కళాశాలలో విద్యార్థులతో మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో విద్యార్థులను పరీక్షల ఒత్తిడి నుంచి దూరం చేసే చర్చ నిర్వహిస్తారని, ఇందులో పాల్గొనేవారు నేరుగా ప్రధానమంత్రితో మాట్లాడి, ప్రశ్నలు అడిగే అవకాశం ఉంటుందన్నారు. ఈ ఈవెంట్ లో పాల్గొనేందుకు ఎంపికైన 2,500 మంది విద్యార్థులకు కేంద్ర విద్యాశాఖ నుంచి పీపీసీ కిట్‌లు అందిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరక్టర్ సీహెచ్ దుర్గాప్రసాద్, వమరవల్లి డైట్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## 28న శనైశ్చరునికి తైలాభిషేకాలు

సత్యంన్యూస్, శ్రీకాకుళం

చిన్నబొందిలీపురం బాయమ్మతోటలో గల శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో నూతనంగా ప్రతిష్ఠించబడిన జిల్లాలోనే అరుదైన 3 అడుగుల ఎత్తు గల శనైశ్చరునికి అర్చకులు ఈదర వేంకట ప్రశాంత్‌శర్మ ఆధ్వర్యంలో తైలాభిషేకాలు నిర్వహిస్తున్నట్టు విశ్వజయము గ్రూప్ ద్వారా ఆలయ నిర్వాహకులు కాశిన వెంకటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 28న శనివారం శని త్రయోదశి సందర్భంగా ఉదయం 6 గంటల నుంచి శనిగ్రహ ప్రీత్యర్థం తైలాభిషేకాలు జరుగుతాయని, గోచార రీత్యా అష్టమ శని (కర్కాటక రాశి), అర్థాష్టమ శని (వృశ్చిక రాశి, ఏలినాటిశని (మకరరాశి, కుంభరాశి, మీనరాశి)వారు తప్పకుండా ఈ అభిషేకంలో పాల్గొంటే శుభమని శాస్త్రవచనం.



## రేపటి వరకు మొబైల్ ఆధార్ సెంటర్లు

(సత్యంన్యూస్, ఆమదాలవలస)



ఆంధ్రప్రదేశ్ గ్రామ/వార్డు సచివాలయాల శాఖ ఆదేశాల మేరకు 0-6 సంవత్సరాల వయసు గల పిల్లలకు ఆధార్ నమోదుకు మొబైల్ ఆధార్ సెంటర్లు ఏర్పాటు చేసిందని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26 నుంచి ఏర్పాటుచేసిన ఈ ఆధార్ సెంటర్లలో ఈ నెల 28 వరకు ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ చేస్తారన్నారు. ఆధార్ నమోదు కాని పిల్లలకు (0-6 సంవత్సరాలు) ఆధార్ నమోదు చేయించుకోవాలని సూచించారు. ఆమదాలవలస మండలం జొన్నవలస, కొర్లకోట, దూసి, బూర్జ మండలం పాలవలస, చీడివలస, సరుబుజ్జిలి మండలం పురుషోత్తపురం, షలంత్రి, పొందూరు మండలం లోలుగు, తాడివలస, పొందూరు-2, రాపాక-1, కణిమెట్ట ప్రాంతాల్లో మొబైల్ ఆధార్ సెంటర్లు ఏర్పాటు చేసినట్టు రవికుమార్ ఆ ప్రకటనలో తెలిపారు.

## అగ్నివీర్ వాయు ఉద్యోగాలకు దరఖాస్తులు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

భారత వాయుసేనలో అగ్నివీర్ వాయు ఉద్యోగాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు యువజన సర్వీసుల శాఖ/సెట్‌శ్రీ సీఈవో బి.వి.ప్రసాదరావు తెలిపారు. ఇంటర్మీడియట్ / 10వ తరగతి 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థుల నుంచి 2025 జనవరి 7 నుంచి 27వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా https://agnipathvayu.cdac.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. ఇతర వివరాలకు భారత వాయుసేన వారి వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. 2005 జనవరి 1వ తేది నుండి 2008 జూలై 1వ తేది మధ్య పుట్టిన అవివాహిత పురుష, మహిళా అభ్యర్థులు మాత్రమే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోడానికి అర్హులన్నారు. ఆన్‌లైన్ టెస్టుకు 3 రోజుల ముందు అర్హత పరీక్ష అడ్మిట్ కార్డులు అభ్యర్థుల వ్యక్తిగత ఈ-మెయిల్స్‌కు వస్తాయని చెప్పారు.

## మన్మోహన్ మృతికి మురళీమోహన్ సంతాపం

(సత్యంన్యూస్, రాజాం)




భారత మాజీ ప్రధాని, ఆర్థిక సంస్కరణల రూపశిల్పి మన్మోహన్ సింగ్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ మాజీ మంత్రి, ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహనరావు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. భారత రాజకీయ చరిత్రలో తనదైన ముద్ర వేసిన మన్మోహన్‌సింగ్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. భారత ఆర్థిక వ్యవస్థకు సరళీకరణ ప్రైవేటీకరణ, ప్రపంచీకరణకు సంబంధించిన అనేక ముఖ్యమైన ప్రకటనలు చేసి భారత ఆర్థికవ్యవస్థను కొత్తపుంతలు తొక్కించారన్నారు. ఆర్థికవేత్తగా దేశానికి మన్మోహన్ చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.

## సీతారామస్వామికి పురస్కారం

(సత్యంన్యూస్, విజయనగరం)

ప్రముఖపండితులు, రిటైర్డ్ హెడ్‌మాస్టర్, బూరవెల్లి లక్ష్మీనరసింహస్వామి ఆలయ అర్చకులు అరవెల్లి సీతారామస్వామికి ఆరామ ద్రావిడ సంఘం ఆత్మీయ పురస్కారం ప్రదానం చేసింది. విజయనగరం రామనారాయణంలో ఆంధ్ర, తెలంగాణ, ఒడిశా రాష్ట్రాల సంఘం ఆత్మీయ కలయిక జరిగింది. సదస్సులో పార్వతీపురం శ్రీ సూర్య పీఠం నిర్వాహకులు వేమకోటి నరహరిశాస్త్రి ఈ పురస్కారాన్ని అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు శంకరశర్మ, గోవింద రావు, రామాయణం సత్యనారాయణ, ఆరవెల్లి గుహానంద్ తదితరులు పాల్గొన్నారు.






## CHANGE OF NAME

I, **BUDIDA DURGA SATYA SAI PRASANNA** W/o : BUDIDA VENKATESH, Residing of D.No 9-3-46, Gudiveedhi, Srikakulam town, srikakulam district, Andhra pradesh state, Pin:532 001, have changed my name from **BUDIDA DURGA SATYA SAI PRASANNA** to **ALLADA DURGA SATYA SAI PRASANNA**, vide affidavit dated 26/12/2024, No: IN-AP53084583234117W.



## అల్లు రమేష్ ఎంపిక పట్ల హర్షం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ స్కీమ్ (ఐసీడీఎస్) శ్రీకాకుళం శాఖలో ప్రభుత్వ న్యాయ సలహాదారుగా న్యాయవాది అల్లు రమేష్ నియమితులు కావడంపై న్యాయవాదులు హర్షం తెలిపారు. బైరి జంక్షన్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన అభినందన సభలో న్యాయవాది పైడి విశ్వేశ్వరరావు తదితరులు ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేసి అభినందించారు. అనంతరం పైడి విశ్వేశ్వరరావు మాట్లాడుతూ స్నేహశీలి, నిరంతర శ్రామికుడు అయిన అల్లు రమేష్ న్యాయసలహాదారునిగా అర్హుడని అన్నారు. ఆయన ఎంపికకు సహకరించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. అల్లు రమేష్ మాట్లాడుతూ తాను ఈ స్థాయికి రావటానికి చాలా కష్టపడ్డానని, ఆంగ్లభాషపై పట్టు తక్కువని, వాటన్నిటినీ అధిగమించి నేడు ఒక స్థాయికి రావటం ఆనందంగా ఉందన్నారు. తన వెంటే ఉంటూ వెన్నుతట్టి ప్రోత్సాహిస్తున్న సహన్యాయవాది విశ్వేశ్వరరావుతో పాటు సహచర న్యాయవాదులకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు ఇచ్చిన ఈ అవకాశాన్ని దుర్వినియోగం చేయకుండా అందరికీ అందుబాటులో ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కోన కశ్వయ్య, బన్న సతీష్‌కుమార్, కోటూరు శైలజ, ఆర్టీఐ కార్యకర్త పి.సురేష్ కుమార్, ఇతర న్యాయవాదులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# విద్యుత్ ఛార్జీల పెంపుపై వైకాపా నిరసన




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కూటమి ప్రభుత్వంలో కరెంటు ఛార్జీల పెంపును వ్యతిరేకిస్తూ శుక్రవారం వైకాపా నాయకులు, కార్యకర్తలు అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో నిరసన ర్యాలీలు చేపట్టి విద్యుత్‌శాఖ అధికారులకు వినతి పత్రాలు అందించారు. నరసన్నపేటలో పార్టీ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ ఆధ్వర్యంలో నాలుగు మండలాల పరిధిలోని ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, ముఖ్య నాయకులతో కలిసి నిరసన తెలిపుతూ భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎలక్ట్రికల్ ఏడీ కార్యలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దాసన్న మాట్లాడుతూ కరెంటు ఛార్జీల పెంపును కూటమి ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఛార్జీల పెంపును ఉపసంహరించుకునే వరకు వైకాపా పోరాటం ఆగదని హెచ్చరించారు. తక్షణమే గృహ వినియోగదారుల నుంచి వసూలు చేయడానికి నిర్ణయించిన రూ.15,485.36 కోట్ల ఛార్జీల ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలన్నారు.

### శ్రీకాకుళంలో..




పార్టీ ఇచ్చిన పిలుపునకు స్పందించిన వైకాపా నాయకులు సూర్యమహల్ కూడలి నుంచి ర్యాలీగా ఎస్‌ఈ కార్యాలయానికి చేరుకొని విద్యుత్ ఛార్జీల పెంపుపై నిరసన తెలిపి, పెంపు ప్రతిపాదన ఉపసంహరించుకోవాలని వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎంవీ పద్మావతి, వైకాపా నాయకులు అంధవరపు సూరిబాబు, గొండు కృష్ణమూర్తి, అంబటి శ్రీను, సాధు వైకుంఠ రావు, ఎన్ని ధనంజయరావు, మార్పు పృథ్వీ, పీస శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

### పలాసలో..

పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీలో మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు నేతృత్వంలో వైకాపా నాయకులు, కార్యకర్తలు విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ ర్యాలీ నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయంలో అధికారులను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి అప్పలరాజు మాట్లాడుతూ పెంచిన విద్యుత్ ఛార్జీలు తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రజలపై కూటమి ప్రభుత్వం పన్నుల పేరుతో అదనపు ఛార్జీలు వసూలుచేయడాన్ని తప్పుపట్టారు.




### ఆమదాలవలసలో..




కూటమి ప్రభుత్వం విద్యుత్‌ఛార్జీల పెంపు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఆమదాలవలస వైకాపా సమన్వయకర్త చింతాడ రవికుమార్ ఆధ్వర్యంలో పోరుబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించి స్థానిక విద్యుత్ అధికారులకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో దుంపల లక్ష్మణరావు, కిల్లి సత్యనారాయణ, పద్మజ, పప్పల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

#### విద్యుత్ ఛార్జీల బాదుడుకు నెల్లిమర్లలో వైకాపా నాయకుల నిరసన



### పాతపట్నంలో...




మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆధ్వర్యంలో నియోజకవర్గ కేంద్రంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి నిరసన ర్యాలీ నిర్వహించి పెంచిన విద్యుత్ ఛార్జీలు ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం డీఈకి వినతిపత్రం అందించారు.

### ఎచ్చెర్లలో..

కరెంటు ఛార్జీల బాదుడుపై వైకాపా పోరుబాట నిరసన ర్యాలీలో ఎచ్చెర్ల మాజీ శాసనసభ్యులు గొర్లె కిరణ్‌కుమార్ పాల్గొని కూటమి ప్రభుత్వ నిర్ణయాన్ని ఎండగట్టారు. అనంతరం రణస్థలం మండలం రామతీర్థాలు కూడలి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఏడీకి వినతి పత్రం అందించారు.




### టెక్కలిలో..



సమన్వయకర్త పేరాడ తిలక్ ఆధ్వర్యంలో వైకాపా నాయకులు, కార్యకర్తలతో కలిసి వైఎస్సార్ కూడలి, అంబేద్కర్ జంక్షన్ మీదుగా విద్యుత్ శాఖ డీఈ కార్యాలయంవరకు నిరసన ర్యాలీ నిర్వహించి పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ వినతి పత్రం అందించారు.

### ఇచ్ఛాపురంలో..

జెడ్పీ చైర్‌పర్సన్, వైకాపా సమన్వయకర్త పిరియా విజయ సాయిరాజ్ నేతృత్వంలో వైకాపా, నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించి సోంపేట మండల కేంద్రంలోని ఏడీ కార్యాలయంలో అధికారులకు వినతి అందించి పెంచిన విద్యుత్ ఛార్జీలకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. నిరసనలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, వైకాపా నాయకులు సాడి శ్యాంప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.